# కార్యం - కారణం

"నేను రాలేను. నీకు తెల్సుగా నా కంపల్షన్స్" అని నవ్వాడు శివరాం. నేను ఒంటరిగానే బయలుదేరాను.

మేమిద్దరమూ కలసి చదువుకుని ఏళ్ళయినా మా స్నేహం చచ్చిపోలేదు. నేనే తీరికున్నప్పుడల్లా శివరాంకి ఫోను చేసేవాడిని. జడ్చర్లలో ఓ ప్రభుత్వపాఠశాలలో నేను హెడ్‌మాష్టరుగా పని చేస్తున్నాను. పెళ్ళీడొచ్చిన కూతురుంది. పిల్లకేదో సంబంధముందంటే నిజామాబాదు వచ్చాను. నిజామాబాదు వచ్చి వాడింట్లో దిగకపోతే వాడూరుకోడు. ఆ రోజుల్లోవాడు ఓ ఇంట్లో అద్దెకుండేవాడు. సంసారం హైదరాబాదు. పిల్లల చదువులవటం వల్ల ఇంకా ఫేమిలీని నిజామాబాదు షిఫ్ట్ చెయ్యలేదు. మకాంమాత్రమే వాడింట్లో. వాడు మిగతాసాయం ఏం చెయ్యడు. న్యాయమూర్తులు సోషియలైజింగ్‌లంటే ఇష్టపడరు. ఏ పరిచయాలు ఏమి డిమాండు చేస్తాయనో అని వాళ్ళ భయం. కనుక, నేను శివరాం సాయంలేకుండానే సదరు సంబంధం విషయంలో పిల్లవాడి తండ్రిని కలిశాను. ఆయన మంచి మనిషే. పిల్లను చూసుకోవటానికి రావల్సిందని ఆహ్వానించాను.

"మీరెప్పుడొస్తానంటే, అప్పుడొచ్చి మిమ్మల్ని తీసుకెళ్తాను" అనీ చెప్పాను. ఆడపిల్ల తండ్రిని కదా!

ఆయన నవ్వి, "అలాంటి అవసరం లేదు. మేమే వస్తాం. వచ్చే ముందు మీకు ఫోను చేస్తాను" అన్నాడాయన.

తిరిగి వస్తూంటే ఆయనడిగాడు, "ఎక్కడ దిగారు?" అని.

చెప్పాను.

"ఆయనా! ఏమనుకోకండి. మహాగట్టి మనిషి. నిందితులు మళ్ళీ అలాంటి చర్యలకు పాల్పడకుండా శిక్ష వెయ్యటంలో కర్కోటకుడని పేరు తెచ్చుకున్నాడు ఆయన" అన్నాడు, నవ్వుతూ.

నేను నవ్వాను. అతని సహృదయత నన్నెంతో ఆకట్టుకుంది. ఆ మాట నేను శివరాంతో అనలేదు. నొచ్చుకుంటాడేమోననుకున్నాను. పనయిపోయింది కనుక వెళ్ళి

పోతానని అంటే, శివరాం నన్ను వెళ్లనివ్వలేదు. "రేపు శనివారం. కోర్టయ్యాక నేనూ హైదరాబాదు వస్తాను. ఇద్దరం కల్సి రేపు సాయంత్రం హైదరాబాదు వెళ్దాం. రాత్రికి మా ఇంట్లో ఉందువుగాని. ఆదివారం పొద్దున్నే బయల్దేరి జడ్చర్ల వెళ్దువుగాని" అన్నాడు శివరాం.

వాడలా అన్నాడంటే అది కోర్టు వారంటే. కాదంటే శివరాంకి కోపం కూడా వస్తుంది.

ఆ సంఘటన జరిగి ఏడెనిమిదేళ్ళయిందనుకుంటాను. మార్చి నెల. అప్పటికే ఎండలు ముదురుతున్నాయి. సాయంత్రం అలా వ్యాహ్యాళికి బయలుదేరాం ఇద్దరమూ.

"ఇదివరకులేని అధికార స్వరం విన్పిస్తుందిరా, నీ మాటల్లో" అన్నాను.

"మరేంచేయను! దుర్మార్గుల్ని, దొంగల్ని, రేపిస్టులను చూసిన కళ్ళకు సమాజం అంతా కుళ్ళిపోయినట్లు కన్పిస్తోంది. ఆ భావనే నీకు అధికార స్వరంలా విన్పిస్తున్నట్లుంది. మళ్ళీ మరొకడు ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడకుండా డిటర్రెంట్ పనిష్మెంట్ ఉండాలి. అప్పుడు మాత్రమే మనం ఈ దుర్మార్గాలను కొంత మేరకయినా నిరోధించగలం" అన్నాడు శివరాం.

వాడన్న మాటలను మననం చేసుకుంటూ,"అలా కాదు. న్యాయం మానవ పక్షపాతిగా ఉండాలి. లా విత్ ఎ హ్యూమన్ ఫేస్ – చట్టం మానవ ముఖాన్ని సంతరించుకోవాలి..." అన్నాను

"వెరీ బాడ్ ట్రాన్స్‌లేషన్! దట్స్ వాట్ దె కాల్ క్రియేటివ్ ట్రీజన్ – సృజనాత్మక ద్రోహం! చట్టం మానవతాస్ఫూర్తిని సంతరించుకోవాలి అను – బాగుంటుంది"

"సర్లే, నేనసలే హెడ్‌మాష్టర్ని! నన్ను కరెక్టు చెయ్యాలని చూడకు. శిక్షకు పర్యవసానం – మళ్ళీ ఆ పని చేయకుండా భయం కల్పించటం కాదు. చట్టానికి మనిషిని మార్చగలిగే ఉదారత్వం కూడా ఉండాలి. నువ్వు ఓ. హెన్రీ రాసిన 'ది రిట్రీవ్డ్ రిఫార్మ్' కథ చదివావా? అందులో నాయకుడు జిమ్మీ వాలంటయిన్."

"ఏమో గుర్తు లేదు. ఏదీ, ఈ జడ్జి పదవి స్వీకరించాక నాకు కేసులు, ముద్దాయిలు, సాక్షులు, తీర్పులతోనే సరిపోతోంది. సాహిత్య వాసన కూడా పడటంలేదు" అన్నాడు శివరాం.

కొన్నాళ్ళు లాయరుగా ప్రయివేటు ప్రాక్టీసు చేశాడు. కొద్దికాలం పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉద్యోగం. ఆ తర్వాత సెషన్సు కోర్టు జడ్జి అయ్యాడు. ప్రస్తుతం నిజామాబాదు ఫాస్టుట్రాక్ కోర్టుకు న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నాడు.

"ఆ కథలో జిమ్మీ ఓ గజదొంగ. అతను జైలు బయట ఉన్నాడంటే ఆ ప్రాంతంలో బాంకు సేఫ్‌లేవీ భద్రంగా ఉండవు. ప్రణాళిక ప్రకారం పోలీసుల కళ్ళుగప్పి, ఆనవాళ్ళు కూడా మిగలకుండా బాంకులను దోచుకోటంలో ఆరితేరినవాడతను. పోలీసులకు చిక్కి శిక్ష అనుభవించాక కూడా అతని ప్రవర్తనలో మార్పు లేదు. చివరిసారి జైలు నుండి విడుదలై బయటికొచ్చాక, ఎన్నో పట్టణాల్లో దోచుకుంటూ, ఎల్మోర్ పట్టణానికి వెళ్తాడు జిమ్మీ. అక్కడా బాంకును దోచుకోవటమే అతని లక్ష్యం! కాని, ప్రమాదంలో పడిపోయాడు- అంటే ఓ అమ్మాయి ప్రేమలో పడిపోయాడు. పాపం !" అని ఓ క్షణమాగి, "పాపం, నీ 'నజభజజజర' ఎలా ఉందో" అన్నాను.

మేం కాలేజిలో చదివే రోజుల్లో శివరాం ప్రేమలో పడిన అమ్మాయి ఆమె. ఆమె పేరు చంపాకలీ. ఉత్తర భారతం వాళ్ళనుకుంటాను. ఎప్పుడో వచ్చి ఆంధ్రదేశంలో సెటిలయ్యారు. వాళ్ళ నాయన ఏదో వ్యాపారం చేసేవాడు. ఆ రోజుల్లో ఆయన వ్యాపారం బాగా సాగుతున్నట్లనిపించలా మాకు. మేం ఉంటున్న వీధిలోనే ఉండేవాళ్ళు. శివరాందీ ఏకపక్ష ప్రేమ-వన్‌వే ట్రాఫిక్, తన ప్రేమను వ్యక్తపరిచే ధైర్యం లేదు వాడికి- అని నేను చాలా రోజులు అనుకున్నాను. కానీ అసాధ్యుడే వాడు.

వాళ్ళ ప్రేమను గురించి నాకూ స్పష్టంగా తెలియదు. శివరాం, నేనూ అప్పుడు గుంటూరు హిందూకాలేజీలో బియస్సీ చదువుతుండేవాళ్ళం. శివరాంవాళ్ళ ఇల్లు బ్రాడీపేట నాలుగో లైను పన్నెండో అడ్డరోడ్డులో ఉండేది. శివరాం నాకు స్నేహితుడు, సహాధ్యాయీ కావటం వల్ల, నేను వాళ్ళ ఇంట్లో ఓగదిలో అద్దెకుండేవాడిని. అప్పుడు చంపాకలీ వాళ్ళ కుటుంబం ఓంకార క్షేత్రం దగ్గర మూడో లైన్లో వుండేవాళ్ళు. ఆమె అప్పుడు బండ్లమూడి హనుమాయమ్మ హైస్కూలులో ఎస్.ఎస్.ఎల్.సి చదువుతుండేది.

వాళ్ళెక్కడ కలుసుకున్నారో, వాళ్ళ ప్రేమ ఎలా మొదలయిందో నాకు స్పష్టంగా తెలియదు. ఓ రోజు వాడు కాలేజీకి రాలేదు. పొద్దున్నే ఇంట్లోనుండి వెళ్ళిపోయాడు. సాయంత్రం బ్రాడీపేట సెంటరులో శివరాం, చంపాకలీ అమరావతి బస్సు దిగుతుంటే చూసిన నాకు వాళ్ళ ప్రేమ విషయం నిర్ధారణ అయింది. అడిగాను. వాడు అవుననికానీ, కాదనికానీ చెప్పలేదు.

ఆ రోజు కాలేజీకి వెళ్తున్నాం, బ్రాడీపేట, అరండల్‌పేట మధ్యగా, రైలు పట్టాల మీద కట్టిన బ్రిడ్జిమీద నుండి. 1958-59లో కాబోలు దాన్ని కొత్తగా కట్టారు.

"ప్రేమించిన వెధవ్వి చెప్పటానికేం మాయరోగం!" అన్నాను నేను వాడితో.

"పెద్దగా అనకు. అసలు మాది ప్రేమో కాదో నాకు తెలియటం లేదు" అన్నాడు వాడు.

"తెలీకుండానే అమరావతి వెళ్ళి వచ్చావా?"

వాడు జవాబు చెప్పలేదు.

ఆ 'చంపాకలీ' కి వాడు పెట్టుకున్న పేరు చంపకమాల. ఆ ప్రేమలో– ముక్కుతిమ్మన నాసికను గూర్చి పద్యాలు రాసినట్టు– మా వాడు ఎన్నో చంపకమాల వృత్తాలను రాశాడు. నేను వాడిని ఉడికించటానికి 'మీ నజభజజజర' అన్నప్పుడల్లా వాడికి కోపం వచ్చేది.

నేను ఇప్పుడు ఆ ప్రస్తావన తీసుకువచ్చేసరికి వాడికి కోపం రాలేదు. మనిషి ఉదాసీనుడయిపోయాడు. వాడు ఆమెను గాఢంగా ప్రేమించాడు. అలా కొనసాగితే ఎలా వుండునో. ఎప్పటికయినా ధైర్యమొచ్చి తన ప్రేమను సాకారం చేసుకోగలిగే వాడేమో!

కానీ, అలాజరగలేదు. ఓ రోజు కుటుంబమంతా ఎక్కడికో ప్రయాణమై వెళ్ళిపోయింది. మర్నాటి సాయంత్రానికల్లా చిన్న తిరపతిలో ఆమె వివాహమై, పసుపుబట్టలతో ఇంటికొచ్చినప్పుడు నిర్ఘాంతపడటం శివరాం వంతయింది. ఆ రోజుల్లో పిచ్చిపట్టినట్లు భగ్నప్రేమికుడిలా తిరిగాడు. ఆ యేడు చదువు కూడా మానేసి పరీక్ష రాయలేదు. అప్పుడు వాడిని తిట్టానో లేదో నాకు గుర్తు లేదు కానీ, ఇన్నేళ్ళ తర్వాత కూడా వాడలా ఉదాసీనుడవటం చూసి నాకు చిర్రెత్తుకొచ్చింది: "ధైర్యం లేని వెధవ్వి! ఇప్పుడు విచారించి ప్రయోజనమేం! ధైర్యం లేనివాళ్ళు ప్రేమించకూడదురా" అన్నాను.

"సర్లే, నీ కథ చెప్పు..." అన్నాడు వాడు.

"నా కథ కాదు. ఓ హెన్రీ కథ. ప్రేమలో ఏం మహత్తు ఉందో, అప్పటి నుండి అతని ప్రవర్తన మారిపోయింది. ఓ చెప్పుల దుకాణం తెరుస్తాడు. నిజాయితీగా బతుకు ప్రారంభిస్తాడు. బాంకు యజమానితో సన్నిహిత సంబంధాలు పెంచుకుంటాడు. అతని రెండో కూతురే జిమ్మీ ప్రేయసి. వాళ్ళ వివాహం మరి కొద్ది రోజుల్లో జరుగుతుందనగా అతను 'దొంగ' అని ముద్ర పడే సంఘటన జరుగుతుంది. బాంకు యజమాని తన కూతుళ్ళూ, మనవరాళ్ళూ, జిమ్మీతో బాంకుకు వస్తాడు. బాంకుసేఫ్ భద్రత కోసం కొత్తగా ఏర్పాటు చేసిన మెకానిజం చూపటానికే వాళ్ళని తీసుకువచ్చాడు. సేఫ్ తలుపు ఒకసారి మూసుకుంటే, తాళం చెవుల్లేకండా దాన్ని తెరవటం సామాన్యుల వల్లకాదు. బాంకు యజమాని చిన్న మనవరాలు బాంకుసేఫ్‌లో ఉండిపోయింది. తాళం చెవులు ఆ పిల్ల దగ్గరే ఉండిపోయాయి. ఆకతాయి పెద్దపిల్ల సేఫ్ తలుపు వేయగానే అది మూసుకుపోతుంది. లోపలున్న పిల్లను రక్షించాలంటే ఆ సేఫ్ తయారు చేసిన కంపెనీ నిపుణులను పిలిపించాలి. వాళ్ళు వచ్చేలోపల ఊపిరి ఆడక లోపల ఉన్న పిల్ల చనిపోవచ్చు. అప్పుడిక జిమ్మీకి గత్యంతరం లేకపోయింది. అలాంటి సేఫ్‌లేవీ జిమ్మీకి లెక్కలేదు. అప్పటికే ఓ పోలీసు

డిటెక్టివ్ అతన్ని అనుసరిస్తూ, అతను చేసే ప్రతిపనినీ గమనిస్తున్నట్టు తెల్సు జిమ్మీకి. అతను దొంగే, అయినా హృదయంలేని మనిషి కాదు. తన ప్రేమనూ, భవిష్యత్తును పణంగా పెట్టి ఆ పిల్లను రక్షిస్తాడు జిమ్మీ. అలాంటి సేఫ్‌లను తెరిచేందుకు ప్రత్యేకమైన టూల్‌బాక్సును అతను స్వయంగా తయారు చేసుకున్నాడు. పిల్లను రక్షించాక పోలీసు ఆఫీసరు ముందు లొంగి పోతాడు జిమ్మీ. జీవితాన్ని మంచిగా మల్చుకున్న అతన్నిప్పుడు జైలుకు పంపటం అతన్ని మరింత కరడు కట్టిన నేరస్థుడిగా మల్చటమేనని ఆ పోలీసు అధికారికి తెల్సు. 'నువ్వెవరో నాకు తెలియదు. ఫో, ఫో' అని అక్కడ నుండి వెళ్ళి పోతాడతను."

"ఈ సంఘటన ఏదో తెలుగు సినిమాలో చూసిన గుర్తు" అన్నాడు శివరాం

"అవును. అందులో జిమ్మీ పాత్రను ఎన్టీఆర్ ధరించాడు. నాకు గుర్తే. ఆ సినిమా వాళ్ళు ఓ. హెన్రీ కథను కాపీ కొట్టారు. చట్టం అలా మానవతాముఖం సంతరించు కోవాలి..."

"అదుగో మళ్ళీ....? నీ రూపకమేం బాగా లేదు."

"నేరస్థులు, అన్యాయవాదులతో నిత్యం వ్యవహరించే నీకు భాషలో అందం ఏం తెలుస్తుందిలే" అన్నాను.

"ఆ మధ్య ఓసారి మన హనుమంతరావు మాష్టారు కన్పించారు హైదరాబాదులో..."

"ఎవరూ, మన జువాలజీ లెక్చరరా?"

"అవును. ఆయన ఆ రోజుల్లో లాగానే సన్నగా ఉన్నారు. ముప్ఫయి ఐదేళ్ళయిందా? అప్పుడే నెత్తిన జుట్టు పల్చగా ఉండేది. మొత్తం బట్టతలే అయింది. గడ్డపునెరుపు తప్ప ఆయనలో పెద్ద మార్పే లేదు. ఆయన నన్ను గుర్తుపట్టలేదు. పరిచయం చేసుకున్నాను. ఆయనెంతో సంతోషించారు."

నాకూ హనుమంతరావు మాష్టారు గుర్తుకు వచ్చారు. ఆయన విద్యార్థులతో సన్నిహితంగా, స్నేహంగా ఉండేవాడు. ఓ సారి జువాలజీ లాబ్‌లో కూర్చుని ఉండగా – ఆ రోజెందుకో ఎక్కువ మంది విద్యార్థులు లేరు – నేను, శివరాం, అనిల్ కుమార్, శేషశాయి కాబోలు ఆయన చుట్టూ కూర్చుని ఉంటే ఆయన చెప్పిన మాటలు ఇప్పటికీ గుర్తున్నాయి – రసాయనికంగా పాము విషంలో ఉంది ప్రొటీన్లే. ఆ ప్రొటీన్లు మనిషిని చంపుతాయి. శరీరానికి బలమిచ్చేది కూడా ప్రొటీన్లే. గమ్మత్తుగా ఉంది కదూ – అన్నాడాయన.

ఆ రోజులు –

"ఆకాశమే మేడ అందులో నా విడిది
ఆడంగ పాడంగ అందరూ రండి!
పక్షులే నేస్తాలు, మబ్బులే చుట్టాలు
బతుకు బతుకంతాను పండగే పండగే"

అని చింతా దీక్షితులు భావనాత్మకంగా పలికిన రోజుల్లాంటివవి.

ఆ రోజుల్లో ఉపాధ్యాయుల్లో పిల్లలకేదో చెప్పాలన్న తపన ఉండేది. ఇవాళ పరిస్థితా? నేనెప్పుడు స్టాఫ్‌రూంలోకి అడుగుపెట్టినా టీచర్లు పేస్కేళ్ళు, డి.ఏలు, ఎ(రియర్ల గురించి మాట్లాడుకోవటమే గానీ, తరువాత తాము తీసుకోబోయే క్లాసులో చెప్పబోయే పాఠాన్ని పునశ్చరణ చేసుకోవటంగానీ, లేదూ విద్యా పరమైన చర్చలు జరగటం గానీ నేను చూడలేదు. ఆనాటి ఉపాధ్యాయులు గుర్తుకొచ్చి మా మనసులు ఆర్ద్రమయాయి. గమ్మత్తు 'నిక్‌నేమ్' లతో పిల్చేవాళ్ళం. మా బాటనీ లెక్చరర్‌ని – జిజీఫస్‌జుజూబా – అనేవాళ్ళం. ఆయన ఆ మొక్క పేరు పల్కటం గమ్మత్తుగా ఉండేది. మా కెమిస్ట్రీ హెడ్‌ను ఎజిఎన్‌ఓత్రీ అని పిల్చేవాళ్ళం. ఆయన హెడ్‌గా ఉన్నకాలంలో సిల్వర్‌నైట్రేట్ దొంగతనం జరిగి, ఆయన పై విచారణ జరిగింది.

"ఆయన రమణమూర్తి – ఉన్నారో లేదో! షేక్స్‌పియర్ డ్రామా ఎంత చక్కగా చెప్పేవారో! ఆయన 'జూలియస్ సీజర్' నాటకం చెప్పేటప్పుడు సీజరు అంటోనీతో అన్న మాటలు, దానికి గురువుగారి వ్యాఖ్యానం ఇప్పటికీ గుర్తే. 'లావాటి మనుషులూ, మృదు ప్రవర్తన కలిగిన వాళ్ళూ, రాత్రుళ్ళు చక్కగా నిద్రపోయే వాళ్ళూ నా పక్కనుంటే బావుంటుంది. అదుగో అక్కడున్న కేషియస్ చూడు. బక్కమనిషి, ఆకలి చూపులు. అతడెప్పుడూ అదేపనిగా ఆలోచిస్తూంటాడు. అలాంటి వాళ్ళు ప్రమాదకారులు' అంటాడు జూలియస్ సీజరు. షేక్స్‌పియర్ బతుకును చూసి రాసిన మాటలు అవి.... ఇవాళ అలాంటి పాత్రే ఒకటి నా ముందుకు వచ్చింది" అన్నాడు శివరాం, ఏదో ఆలోచిస్తూ.

"అంటే...?"

"కోర్టులో ఎనిమిది నెలల క్రితం జ్యుడీషియల్ రిమాండుకు పంపాను ఆ కుర్రవాడిని. ఆ యువకుడి పేరు మధు. పెళ్ళయిన నెల రోజుల్లోపలే భార్యను హతమార్చటానికి ప్రయత్నించాడు. భార్యభర్తల మధ్య గిల్లికజ్జా పెద్దదై అతను పిచ్చి ఆవేశంలో ఆమె పొట్టలో పొడిచాడు. ఆమె ఆసుపత్రి పాలయింది. పోలీసు స్టేషనులో కేసు ఐపిసి 307, 498ఎ సెక్షన్ల కింద నమోదయింది. ఆమె గాయలనుండి కోలుకోటానికి చాలా రోజులే పట్టింది.

పోలీసులు అతన్ని, అతని తండ్రిని అరెస్టు చేశారు. హత్యాప్రయత్నం, వరకట్న వేధింపుల కింద కేను నమోదయింది. పాపం ముక్కు పచ్చలారని పిల్లను చంప ప్రయత్నించిన ఆ కుటుంబమంటే నాకు ఎంతో అసహ్యమేసింది. ముఖ్యంగా ఆ పిల్లవాడి తండ్రి. అతడట్లాగే- షేక్స్‌పియర్ వర్ణించిన కేషియస్ లాగానే ఉంటాడు. ఆకలి చూపులు, ఆవులిస్తే పేగులెక్క పెట్ట గలిగే తెలివి. అతని ముఖంలో ఎప్పుడో గాని చిరునవ్వు మొలవదు. ఆ నవ్వు కూడా తన్నుతాను చూసి వెక్కిరించుకున్నట్లుగా, ప్రతిదానికీ నవ్వే తన బుద్ధిని నిరసించుకున్నట్లుగా వుంటుంది- అచ్చగా షేక్స్‌పియర్ చెప్పినట్లే."

"మీది ఫాస్ట్ ట్రాక్ కోర్టు కదా! ఇంకా తెమల్లా ఆ కేసు....?"

"కేసు ముందుకు కదల్లేదు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అడ్జర్నమెంట్లు అడుగుతుంటాడు. నేనన్నీ నీకు చెప్పకూడదు. సంఘటన జరిగిన మూడు నెల్లకు ఆ కాషియస్‌కు బెయిలు లభించింది. సంఘటన జరిగినప్పుడు తల్లి కూతురు కాన్పుకని పొరుగూర్లు ఆస్పత్రిలో ఉండిపోయిందట. లేకపోతే ఆ పిల్లవాడి తల్లిని కూడా రిమాండుకు పంపాల్సి వచ్చేది. పైగా బాధితురాలు కూడా అత్త మీద మామ మీద పెద్దగా ఫిర్యాదుచెయ్యలేదు."

కాసేపాగి చెప్పాడు శివరాం "అందుకే ఆ కాషియస్‌ను వదిలేయాల్సి వచ్చింది. ఇవాల్టితో కేసు నిర్ధారణ అయింది. ఆ యువకుడు దోషి అనే నిర్ధారించాను. రేపు శిక్షాకాలాన్ని ప్రకటించేస్తే ఆ కేసు ఓ కొలిక్కి వచ్చినట్లవుతుంది. చెప్పొచ్చేదేమిటంటే..."

నేను శివరాంని మాట్లాడనివ్వ లేదు. "సాహిత్యంలో దర్శనమిచ్చే పాత్రలకు రిప్లికాలు కాదు మనుషులు. ప్రతివ్యక్తీ భిన్నుడే. ఆ పరిస్థితులు, వాతావరణం అన్నీ తెలుసుకుని - ఆ తెలియటంలోనూ మన మానవ అవగాహన ఎంతపాటిది - న్యాయం చెయ్యాలి. ఈ ప్రపంచంలో న్యాయమే కాని, ధర్మంలేదు..." అన్నాను నేను.

"రెండూ ఒకటేలే" అన్నాడు శివరాం.

"కాదు. ధర్మం ఎండలా మాడ్చేస్తుంది, వర్షంలా దయచూపుతుంది. అందరిపట్లా ఒకే విధంగా ఉంటుంది. న్యాయం దేశ కాల పరిస్థితులను బట్టి మారుతూ ఉంటుంది. నువ్వు న్యాయం చెయ్యగలవేమో గానీ, ధర్మాన్నాచరింప చేయలేవు. అది కష్టం" అన్నాను.

మర్నాడు నేనులేచేటప్పటికే శివరాం స్టెనోకు డిక్టేషన్ ఇస్తున్నాడు. ఏదో జడ్జిమెంటు కాబోలు. నేను లేచి కాలకృత్యాలు తీర్చుకొని, స్నానం చేసి వచ్చేటప్పటికి బ్రేక్‌ఫాస్ట్ అరేంజ్ చేశాడు మా ఇద్దరికీ పనివాడు. టిఫెను తిన్నాక కోర్టుకు వెళ్తూ, "పన్నెండింటికి కుర్రాడు భోజనం పట్టుకొస్తాడు. భోంచేసి కునుకుతీ. మీ టీచర్లు క్లాసుల్లో చేసే పని అదేగా" అన్నాడు వాడు.

"చంపుతా వెధవా! మేం కునికితే భవిష్యత్తరాలు ముందుకు సాగవు. నువ్వు కునక్కుండా చూసుకో. న్యాయం, ధర్మం కునుకుతాయి."

"సర్లే. తోచకపోతే టీవి పెట్టుకో. అప్పటికీ తోచకపోతే కోర్టుకురా. అక్కడ నీకు డిఫరెంట్ కారెక్టర్లు కన్పిస్తాయి, తోచక పోవటమనే ప్రశ్నే వుండదు" అని చెప్పి శివరాం వెళ్ళిపోయాడు.

పన్నెండింటికి కారియర్ భోజనం చేసి, కాస్తంత సేపు కునుకు తీశాను. టీవి సీరియల్స్ చూసే అలవాటు ఎలాగో లేదు. బట్టలేసుకుని కోర్టుకు వెళ్ళేటప్పటికి మధ్యాహ్నం రెండు గంటలయింది.

భార్యను హతమార్చటానికి ప్రయత్నించిన ఆ యువకుడి కేసు అప్పుడే మొదలయింది. అప్పుడే ముద్దాయిని బోనులో ప్రవేశపెట్టారు పోలీసులు. పిల్లవాడి వెంటే ఇద్దరు భార్యాభర్తలు – బహుశ పిల్లవాడి తల్లిదండ్రులనుకుంటాను – కోర్టులోపలికొచ్చారు. కోర్టులోకొచ్చాక ఇంక ఆ యువకుడితో మాట్లాడ అనుమతించలేదు పోలీసులు. ఆ దంపతులు విజిటర్స్ బెంచి మీద నా పక్కనే కూర్చుంటుంటే నేను ఆమె వంక చూసి నిర్ఘాంతపోయాను. అయితే, అంత ఆశ్చర్యంలోనూ నేను న్యాయపీఠం అధిష్ఠించి ఉన్న నా మిత్రుడు శివరాం వంక చూడటం మాత్రం మర్చిపోలేదు. వాడూ ఆమెను చూశాడు. మనిషి కంగుతిన్నట్లయిపోయాడు. క్షణంలో ప్రపంచం మర్చిపోయినట్లయిపోయివుండాలి వాడికి. అయితే, బాధ్యతాయుతమైన స్థానమధిష్ఠించివున్న వ్యక్తి. క్షణంలో తెప్పరిల్లాడు. నిబ్బరంగా కూర్చున్నాడు.

ఆమె... ఆమె చంపాకలీ. నా మిత్రుడి 'చంపకమాల'. ఎలాంటి మనిషి ఎలా అయిపోయింది. సైరంధ్రిగా సుధేష్ణ కొలువులో ప్రవేశించే ద్రౌపదిని తిక్కన వర్ణించిన తీరు గుర్తుకు వచ్చింది నాకు. ఆయన భావన నా మాటల్లో చేప్తే, ఆమె "కారు మబ్బు కమ్ముకొన్న నెలవంకలా, తెలిమంచు జడిలో మరుగు పడిన తామర విరిలా, ధూమంలో మెరగులు నలిగి మాసిన దీపకళికలా, పెంధూళిలో మరుగుపడిన పూలతీగలా" కన్పించింది. ఆమె నన్ను గుర్తు పట్టినట్టులేదు. శివరాంని గుర్తుపట్టిందా? నీలిఛాయలు అలుముకున్న ముఖమది. కొడుకు భవిష్యత్తు ఆ కరకు న్యాయధిపతి హస్తగతమై ఉంది.

ఆ వెనువెంటనే నేను ఆమె పక్కన కూర్చున్న ఆమె భర్త వంక – మా శివరాం పరిభాషలో 'కాషియస్' వంక – చూశాను. సన్నటి మనిషి అతను. వయసుతో వడలిన ముఖం. పేదరికం అతన్ని తన పరిష్వంగంలోకి తీసుకున్న ఛాయలు ప్రస్ఫుటమవుతూనే ఉన్నాయి. అందువల్లే బహుశ అతనికి మూడు నెలలదాకా బెయిలు లభించి ఉండకపోవచ్చు. అతని కొడుకు కూడా ఎనిమిది నెలలదాకా జుడీషియల్ కస్టడీలో

మగ్గిపోవటానికి కారణం అతని ఆర్థిక దుస్థితి, తనవాళ్ళ అండ లేకపోవటమే కారణమై ఉండవచ్చు. శివరాం అభివర్ణించినట్లు అతని చూపులో నాకెలాంటి ఆకలి స్ఫురించలేదు. అది బతుకు శిశిరపు హేల. అతనున్న పరిస్థితిలో నవ్వు వచ్చే అవకాశం లేదు. తన బతుకునే నిరసించుకునే స్థితిలో ఉన్నాడతను.

కోర్టు జమేదారు సూచనతో న్యాయస్థానం నిశ్శబ్దమైంది. న్యాయాధిపతి తన జడ్జిమెంటులో 'ఆపరేటివ్ పార్ట్' చదివి విన్పించబోతున్నాడు. నాకప్పుడు శివరాం ముఖం చూసేసరికి ఏమాత్రం తనకు ఇష్టంలేని పనిని విధిలేక చేయాల్సిన వ్యక్తిలా కన్పించాడు. అప్పుడో సంఘటన జరిగింది.

బాధితురాలు - ఆ యువకుడి భార్య కోర్టులోకి వచ్చింది. ఆమె వెంట లాయరు వకాలత్‌నామా సమర్పిస్తూ, ఆమె కోర్టు వారికేదో విన్నవించుకుంటుందనీ, అందుకు న్యాయాధిపతి దయతో అనుమతించాల్సిందనీ కోరాడు. అప్పటిదాకా టెన్స్‌గా ఉన్న శివరాం ముఖం కొద్దిగా సేద తీరినట్లయింది. ఆ పిల్లకు 19-20 ఏళ్ళ వయసుంటుందేమో పేరు సుజాత. ఆమె ముఖంలో గాబరా స్పష్టంగా కన్పిస్తోంది. తన భర్తకు శిక్ష పడితే - ఎంత కాలం శిక్ష పడుతుందో ఎవరికీ తెలీదు - 307 సెక్షను హత్యా ప్రయత్నం కింద పదేళ్ళ వరకూ శిక్ష పడవచ్చునని ఆమె లాయరు ఆమెకు చెప్పే ఉంటాడు. ఆపైన న్యాయమూర్తి ఇలాంటి కేసుల్లో నిర్దయగా ఉంటాడనీ చెప్పి ఉండవచ్చు. భర్తకు పదేళ్ళ శిక్ష పడితే తన బతుకేం కావాలి? తనకు పెళ్ళయినట్లా - కానట్లా! ఈ భావాలన్నీ ఆమె ముఖంలో ద్యోతకమవుతూనే ఉన్నాయి.

"ఊఁ చెప్పమ్మా! నువ్వేం చెప్పదల్చుకున్నావో" అన్నాడు శివరాం.

"నేను...నేను..." గాబరా పడిపోయింది ఆ పిల్ల. చుట్టూ జనం. అంత మందిలో మాట్లాడి ఎరుగని అనుభవం ఆమెను భయకంపితురాలను చేసింది.

"భయపడాల్సిందేం లేదు తల్లీ! నీ మనసులో మాట నువ్వు చెప్పుకోక పోతే ఎలా తెలుస్తుంది?" శివరాం గొంతు వాత్సల్య భరితంగా ఉంది. ఉద్వేగరహితంగా మాట్లాడ ప్రయత్నించి విఫలమయినట్లున్నాడు.

మెల్లమెల్లగా ఆ పిల్ల చెప్పసాగింది. వెనక మాట ముందూ, ముందు మాట వెనకా చెప్పింది. తన మనసులోని భావాలను పూర్తిగా తగిన భాషలో చెప్పలేక పోయింది. అయితే భావవ్యక్తీకరణకు మాటలే శరణ్యం కాదు కనుక కోర్టులో ఉన్నవారికందరికీ ఆమె గుండెలోని బాధ అర్థమైంది. ఆమె చెప్పిన మాటల్నే, కాస్తంత పాండిత్యం రంగరిస్తే ఎలా ఉంటుంతో నా మాటల్లో చెప్తాను. ఎందుకంటే ఆ పిల్ల కోర్టులో వాఙ్మూలమిచ్చి

చాల ఏళ్ళు గడచిపోయాయి. ఆమె చెప్పిన మాటల సారంశం తప్ప అచ్చంగా ఏమి చెప్పిందో గుర్తులేదు.

"మా పెళ్ళి 1998 డిసంబరు 11న జరిగింది. ఆయన బి.కాం చదివాడు. ఓ ప్రయివేటు కంపెనీలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. రెండు వేలు జీతమొస్తుంది. మా నాయన కూడా కలిగిన వాడు కాదు. గంతకు తగ్గ బొంతని ఈయనకిచ్చి నా పెళ్ళి జరిపించాడు. మా మామ మెత్తటి మనిషి. ఇంత కట్నమివ్వమని ఖారాఖండీగా అడగలేదు. అట్లాగని ఏ తండ్రీ ఆడపిల్లను కట్నమివ్వకుండా పంపడు కదా! ఆయన ఏదో ఇచ్చాడు, ఈయన పుచ్చుకున్నాడు. మా అత్త కూడా మంచిదే. నేను మా అత్త-మామ విషయంలో ఏ సందర్భంగానూ ఫిర్యాదు చేయదల్చుకోలేదు.

"మా ఆడబిడ్డ నవీపేటలో ఉంటుంది. రెండో కాన్పు. నెలలు నిండాయి. రెండో కాన్పు పుట్టింటిలో పోయగూడదని ఆచారం. అందుకే మా అత్త కూతురికి సాయపడటానికి నవీపేట వెళ్ళింది. మా మామ కూడా ఆ రోజో ఆ మర్నాడో వెళ్ళాలి. నాది కొత్త కాపురం. నా భర్త చాల మంచివాడు. నేనంటే ఎంతో ప్రేమ. నాకప్పటికింకా తెలియదు. పుట్టింటి మమకారం పోలేదు. అత్తా-మామా ఇంట్లో ఉంటే నేను పుట్టింటికి పోవాలంటే అభ్యంతరం చెప్తారేమోనన్న భయం నాకుంది. అందుకే వాళ్ళు లేని సమయంలో ఓ సారి మా అమ్మ, నాన్నలను చూసి రావాలనిపించింది.

"ఆ రోజు జనవరి మూడో తారికు. నేను మా ఆయనకు చెప్పాను - మా పుట్టింటికి వెళ్ళి ఓ వారం రోజుల్లో తిరిగి వస్తానని. ఆయన గట్టిగా వీల్లేదన్నాడు. ఆయన నా మీద అధికారం చెలాయించేవాడు. నాకూ ఇష్టమే. చాల మురిపెంగా కూడా ఉండేది. ఆఫీసుకు వెళ్ళినప్పుడు తప్ప క్షణం నన్ను విడచి ఉండేవాడు కాదు. ఒకో రోజు ఆఫీసుకు కూడ సెలవుపెట్టి వచ్చేవాడు. 'పెళ్ళాం ఎక్కడికి పోతుందిరా, సెలవులు అనవసరంగా వృధా చేసుకోకు' అని కూడా మా అత్తగారు అనేది. ఆయన నేను పుట్టింటికి వెళ్ళటానికి నిరాకరించగానే నాకు కోపం వచ్చింది. నేను వెళ్ళాల్సిందే అని పట్టుబట్టాను. 'ఏం ఉందే, ఆ బోడి కొంపలో? అంత పెనుక్కు చస్తున్నావు! ఇంటికి అల్లుడొస్తే వేసేందుకు ఓ మంచి కుర్చీ కూడా లేదు' అన్నాడు.

"నాకు మండిపోయింది. 'ఉండిందేందో వుండింది. అన్నీ చూసే చేసుకున్నావుగా! నీ రెండు వేల జీతం - గుమాస్తా నౌకరీకి మాది పెద్ద సంబంధమే!' అన్నాను.

"దాంతో మాటా మాటా పెరిగింది. 'చంపేస్తాను, పిచ్చివాగుడు వాగావంటే. ఆడదంటే మగడి చెప్పు కింద పడి ఉండాలి' అన్నాడు. నేనూ అంతో ఇంతో చదువు

కున్నాను. చెప్పుకింద పడి ఉండాలనేటప్పటికి నాకూ ఒంటికి కారం రాచుకున్నట్లయింది. నేను పురుషాహంకారాన్ని దుయ్యబట్టాను. అనాదిగా స్త్రీ ఎలా అణచివేతకు గురవుతుందో కసిగా వివరించాను. 'ఇంక మీ పురుషాహంకారం స్త్రీలు భరించే రోజులు పోయాయి' అని హెచ్చరించాను".

"ఏందే మాటలు మీరుతున్నావు. ఈ కత్తితో ఒక్క పోటు పొడిస్తే క్షణంలో చచ్చి ఊరుకుంటావు అన్నాడయన. అప్పుడు ఆయన వంటచేయటంలో నాకు సాయం అన్నట్టుగా కూరలు తరుగుతున్నాడు. ఆ కూరలు తరిగే కత్తిని చూపి బెదరించాడు".

"చంపుతావా? చంపు - అంత మొగతనముంటే! నీ తాటాకు చప్పుళ్ళకు ఇక్కడ భయపడేవాళ్ళెవరూ లేరు. అన్నాను. తరుగుతున్న దోసకాయ పక్కన పడేసి, ఇంకొక్కమాట పెగిలావా ఈ కత్తి నీ గుండెల్లో దింపుతాను అన్నాడు ఆయన".

"ఆయన కళ్ళు కెంపులయాయి. అంత ఆవేశం నేనెప్పుడూ చూడలేదు. ఓ క్షణం భయపడిపోయాను. అయినా బింకంగా, 'ఏదీ, చంపుచూద్దాం. నన్ను చంపి నువ్వు బతికి బట్టకడ్తాననుకోకు. నిన్నురితీస్తారు' అన్నాను".

"అంతే. మహా ఆగ్రహంతో, నా జుట్టు పట్టి లాగి చేతిలో ఉన్న కత్తితో నా డొక్కల్లో పొడిచారు. నేను చెయ్యి అడ్డం పెట్టాను. చేతిని ఒరుసుకుంటూ కత్తి డొక్కలో దిగింది. నేను పెద్దగా అరిచాను - 'ఈ దొంగచచ్చినోడు నా ప్రాణాలుతీస్తున్నాడ'ని"

"చుట్టుపక్కలవాళ్ళు నా అరుపులు విని బయటికొచ్చారు. రక్తం చూసేసరికి నా మొగుడికి ఆవేశం దిగిపోయింది. భయమేసింది. నేను చనిపోయాననే ఆయన అనుకున్నాడు. పారిపోయాడు. నేను చనిపోతున్నాను కనుక నాకు చేయాల్సిందేమీ లేదని అనుకుని వుండవచ్చు. ఎవరికైనా ముందు తన్ను రక్షించుకోటమే కర్తవ్యం! వెంటనే పొరుగువాళ్ళు పోలీసులకు కబురు పెట్టారు. అప్పుడే ఇంటిలోకొచ్చిన మామ నన్ను ఆ పరిస్థితిలో చూసి గోల పెట్టాడు. పోలీసులు నన్ను ఆసుపత్రిలో చేర్పించారు. ప్రాణ భయంతోవున్న నేను, మా వాళ్ళు చెప్పమన్నట్టు మా మామకు కూడా ఇందులో భాగముందని చెప్పాను. పాపం, ఈ విషయంలో ఆయనకేం సంబంధం లేదు. పోలీసులు మా మామను అరెస్టు చేశారు. పారిపోయిన మా ఆయన్ను గాలించి పట్టుకున్నారు".

"నేను న్యాయమూర్తులకు విన్నవించికునేది ఒక్కటే. మా అత్త-మావలుగాని, నా భర్తగాని వరకట్న దాహంతో నన్ను వేధించ లేదు. నా భర్తకూ నన్ను చంపాలన్న ఆలోచనలేదు. నేనంటే ఆయనకు అపరిమితమైన ప్రేమ. నా విరహాన్ని భరించలేకే, క్షణికావేశంలో ఆయన చేసిన పని అది. ఇప్పుడాయన్ను మీరు మీ శిక్షాస్మృతిననుసరించి

జైలుకు పంపితే, అది నా కాపురాన్ని బాగుచెయ్యటమవదు, నాశనం చేసినట్లవుతుంది. అప్పుడు ఆయన మీద కోపంలో, 'ఆయన నన్ను చంప ప్రయత్నించాడ'ని పోలీసులకు ఫిర్యాదు చేసిన మాట నిజమే. అది ప్రాణభయంలో చేసిన ఆరోపణ. ఆ ఆరోపణను మీరు అనుమతిస్తే ఉపసంహరించుకుంటాను. మమ్మల్ని మళ్ళీ కలసి బతకనివ్వండి - అని మిమ్మల్ని వేడుకుంటూ చేతులెత్తి మొక్కుతున్నాను" అన్నది ఆమె వెక్కివెక్కి ఏడుస్తూ.

అప్పుడు జడ్జి, "నువ్వేం చెప్తావయ్యా నీ భార్య మాటకు?" అనడిగాడు నిందితుడిని.

"మీదయ! నా భార్య మీద ప్రేమ లేక కాదు. అది ఆవేశంలో చేసినపనే. మీరు కరుణ చూపితే, నా భార్యతో కలసిమెలసి ఉంటాను. ఆమెకు ఎలాంటి హాని తలపెట్టబోనని దేవుఁడిలాంటి మీ ఎదుట ప్రమాణం చేస్తున్నాను," అన్నాడతను జడ్జికి నమస్కరిస్తూ.

జడ్జి తల పంకించాడు. ఓ ఐదు నిమిషాలు కాయితం మీద గిలికాడు. జడ్జిమెంటు 'ఆపరేషనల్ పార్ట్' ను చదివి విన్పించాడు.

"బాధితురాలు సమర్పించిన అఫిడవిట్‌ను, కోర్టు వారి ముందు నివేదననూ, నిందితుడి ప్రమాణ పూర్వక వాగ్దానాన్ని పరిగణనలోకి తీసుకుంటూ, నిందితుడి శిక్షా కాలాన్ని తగ్గించటం జరిగింది. చట్టం మనిషి ప్రవర్తనలో పరివర్తనను ఆశించేదే కాని శిక్షించటమే దాని ధ్యేయం కాదు. ఈ కేసులో మరింత కాలం నిందితుడిని శిక్షించటం బాధితురాలిని మరింత బాధించటమే అవుతుంది కానీ ఆమెకు న్యాయం చేయటమవదు. కనుక, నిందితుడు ఇప్పటిదాకా జ్యుడీషియల్ కస్టడీలో గడిపిన ఎనిమిది నెలల కాలాన్ని శిక్షాకాలంగా పరిగణిస్తూ, ఇంక అతను శిక్ష అనుభవించాల్సిన పని లేదని నిర్ణయిస్తూ, అతన్ని వదలివేయటం జరుగుతుంది."

అప్పటికే ఐదు గంటలయింది. కోర్టు ముగిసే సమయం. న్యాయమూర్తి న్యాయపీఠాన్నుండి లేచినిలబడ్డాడు. అందరికంటే ముందు లేచి నిలబడింది చంపకమాల. న్యాయధిపతికి చేతులు జోడించి నమస్కరించింది. ఒక్కసారి న్యాయమూర్తి ఆమె వంక చూశాడు, గిరుక్కున తిరిగి తన ఛేంబర్‌లోకి వెళ్ళిపోయాడు. ఫాస్ట్‌ట్రాక్ సెషన్స్‌కోర్టు బర్ఖాస్తయింది.

వాళ్ల చూపులు నేను గమనించాను. ఎవరు ఎవరికీ చెప్పుకోలేని మాటలు, చెప్పాల్సిన అవసరం లేని మాటలు చెప్పుకున్నట్టే వుంది.

సాయంత్రం ఆరింటికి నేనూ, శివరాం హైదరాబాదు బస్సు ఎక్కాం. వాడేం మాట్లాడలేదు. గంభీరంగా ఉన్నాడు. నేనూ పలకరించ సాహసించలేదు. ఓ గంటయ్యాక అన్నాను, "నేనడగాల్సిన ప్రశ్నలు కొన్ని ఉన్నాయి. అడిగేదా?" అని

"అడగొద్దు. నేను జవాబులు చెప్పను" అన్నాడు వాడు సన్నగా, విషాదంగా నవ్వుతూ.

"నువ్వు మొదటగా రాసిన జడ్జిమెంటులో ఆ పిల్లవాడికి ఎన్నేళ్ళ శిక్ష విధించావు?"

శివరాం జవాబు చెప్పలేదు.

"చంపకమాలను చూశాక నీ మనసు మారిపోయింది కదూ?"

అందుకూ శివరాం జవాబు చెప్పలేదు.

"సుజాత అభ్యర్ధన నిన్ను గట్టెక్కించింది. నువ్వు చంపకమాలకు న్యాయం చేశావు కానీ సుజాతకు కాదు..."

"షటప్ !"

"ఆ పిల్లవాడిపట్ల నీకెలాగో కనికరం లేదు. చంపాకలీ భర్త నీకు 'కాషియస్' ఎందు కయ్యాడు? ఈ 'కాషియస్' భార్య చంపాకలీ అని నీకు తెలుసు. ఆ చంపాకలీ నీ చంపకమాల అయినా కాకపోయినా ఆ పేరున్నస్త్రీల మొగుళ్ళందరూ దుర్మార్గులేనని నీ నమ్మకం. వాళ్ళంటే తెలియని ఈసు నీకు. నేరం చేసినట్టు సాక్ష్యం లేకపోయినా అతనికి మూడు నెలలదాకా బెయిలెందుకు లభించలేదు? ఆమె భర్తపట్ల నీది నిర్హేతుకమైన కార్పణ్యం. సుజాత కాదు ఆ పిల్లవాడిని రక్షించింది- అది చంపకమాల. తల్లి కొడుకుని రక్షించుకుంది."

శివరాం నా మాటలు వినిపించుకుంటున్నట్లు కన్పడలేదు. అతడెక్కడో ఉన్నాడు. నన్నో ప్రహేళిక వేధించింది- శివరాం న్యాయాన్ని నిలబెట్టాడా? ధర్మాన్ని నెరవేర్చాడా?

జీవితంలో ఎన్నో ప్రశ్నలు-ప్రహేళికలు-అన్నింటికీ సమాధానాలేవీ? ఓ కార్యం సిద్ధించిందంటే అందుకు కారణాలు అనేకం! ఈ కారణంవల్లే ఈ కార్యం సిద్ధించినదన గలమా? మోటివ్స్ ఆర్ మిక్స్‌డ్!

*నవ్య (వీక్లీ, 10-09-2008)*

*(రావి శ్రీకృష్ణమూర్తి 2009 స్మారక కథల పోటీలో రెండవ బహుమతి*

*(06-06-2009) గెల్చుకున్న కథ)*